క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మత్తు పనుల కారణంగా గురువారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు హౌజింగ్‌బోర్డ్ కాలనీ, సీఐబీ క్వార్టర్స్, వాటర్‌ట్యాంక్, జామియా మజీద్ పరిసర ప్రాంతాలు
- ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు వాహెద్ నగర్, మలక్‌పేట హౌజింగ్ బోర్డ్ కాలనీ, వాహెద్ నగర్ వాటర్‌ట్యాంక్, జియా ఉల్ హక్ మజీదు పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 43, వంకాయ 33, బెండ 40, పచ్చిమిర్చి 75, కాకర 45, బీర 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 50. దొండ 35, ఆలు 20, ఉల్లి 17, గోకర 40, దోస 15, సొర 11, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 85, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 35, బీట్‌రూట్ 28, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 65.
ఈ ధరలు గురువారం 9 గంటల వరకు ఈధరలు అమలులో ఉంటాయి.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వినోద్‌కుమార్



మలక్‌పేట: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మలక్‌పేట నియోజకవర్గం అక్బర్‌బాగ్‌కు చెందిన ఆముద వినోద్‌కుమార్ వంజరి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి కార్యవర్గ సభ్యుల జాబితాను ప్రకటించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీని మరింతగా పటిష్టం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తిమేరకు పని చేస్తానన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న హరిగౌడ్

సైదాబాద్: బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సూచించారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న లింగాల హరిగౌడ్‌ను మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సంగతి విదితమే. ఈ సందర్భంగా ఆయన బుధవారం బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

జెడ్సీ కార్యాలయంలో అవగాహన సదస్సు



అధికారుతో మాట్లాడుతున్న సుజాతనాయక్

హస్తినాపురం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాలన వికేంద్రీకరణపై బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజ, ఎల్‌బీనగర్ డీసీ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పరిపాలన వికేంద్రీకరణ వల్ల ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు.

పశువులను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

హస్తినాపురం: అక్రమంగా పశువులను తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం రానా గ్రామానికి చెందిన పట్నా గోవింద్ (40), శ్రీకాకుళం జిల్లా సల్లవారిపేట గ్రామానికి చెందిన తాని రాము(35), శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం దోగం గ్రామానికి చెందిన గుడ్డు రమేశ్ (40) నల్లగొండజిల్లా కోదాడ పట్టణం నుంచి నగరంలోని చాంద్రాయణగుట్టకు పశువులను తరలిస్తున్నారు. వనస్థలిపురం దగ్గర విజయవాడ జాతీయ రహదారిపై డీ-మార్టు వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్ గోవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కోదాడ నుండి చాంద్రాయణగుట్టకు తరలిస్తున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి పశువులను గోశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరకొర వసతులు.. అవస్థలో విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల లేమి
- అరకొర ఉపాధ్యాయులతోనే బోధన
- మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేని వైనం

సాక్షి ఫోకస్



బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాల తరగతి గది ఇలా..

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వలసతులతో పాటు ఆట స్థలాలు లైబ్రరీ సౌకర్యం, టాయిలెట్స్ అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన అధికారులు, ప్రజా ప్రతినిధులకు లేకపోవడం విచారకరమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పిస్తామన్న మంత్రుల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా పలు పాఠశాలలను సాక్షి విజిట్ నిర్వహించి విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చింది.

ప్రధాన సమస్యలివే..

- బండ్లగూడలోని పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది.ఏ మాత్రం వర్షం వచ్చిన ఇక్కడ విద్యార్థులకు సెలవులే. శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్డును అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులకు నోచుకోకలేకపోతుంది.
- కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో సరైన బాత్రూమ్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాల కోసం ఇళ్లలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మధ్యాహ్నం భోజనం చెట్ల కిందనే. గదుల కొరతతో కొత్తగా విద్యార్థులను చేర్చుకోడం లేదు.
- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహేబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 470 మంది విద్యార్థులు ఉండగా 12మంది ఉపాధ్యాయులే ఉన్నారు.హిందీ, సైన్స్, సోసల్ సబ్జెక్టులు బోధించేందుదు అదనపు సిబ్బంది అవసరం ఉంది.
- సాహేబ్‌నగర్ పాథమిక పాఠశాలలో 400మంది విద్యార్థులు ఉంటే 9 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. అదనంగా మరో ముగ్గురిని నియమించాల్సి ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.
- సరూర్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడ టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.
- మధ్యాహ్న భోజనాలను చెట్ల కిందనే చేస్తుండడంతో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. సరూర్‌నగర్ పాఠశాలలో అదనపు గదుల అవసరం ఉంది.
- హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నత్తనడకన సాగుతున్న టాయిలెట్‌ల నిర్మాణ పనులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం పాఠశాలల్లో వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నత్తనడకన టాయిలెట్‌ల నిర్మాణం

బాల్య వివాహాలకు సహకరిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి

వనస్థలిపురం: మైనార్టీ తీరకముందే వివాహాలు చట్ట విరుద్ధమని, వివాహాలు జరిపించిన పెద్దలు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, పెళ్లికి సహకరించిన వారందరూ శిక్షార్హులని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లైట్, జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాహెబ్‌నగర్‌లోని నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని వాహనాలు నడపడానికి అర్హులన్నారు. స్మార్ట్‌ఫోన్లు అధికంగా వాడడం అనర్థకమని, అవసరమైనంత మేరకు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. లైట్ అధ్యక్షురాలు, హైదరాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి విశ్రాంత చైర్ పర్సన్ పి.శ్యామలాదేవి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కడైనా పనిచేస్తూ కనిపిస్తే 1098, లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. 18 సంవత్సరాల లోపు యువత ప్రమాదకర పనుల్లో ఉండరాదని చట్టం ఉందని ఆమె గుర్తు చేశారు. జాగృతి చైర్మన్ భావన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లీలారాణి, స్కూల్ కమిటి చైర్మన్ జి.నవనీత, నక్క యాదగిరి స్వామి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, నక్క ఉమేష్‌యాదవ్, రామలింగేశ్వర్ రావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు ప్రజా సమస్యలు పట్టవా?



నాలా పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చైతన్యపురి: ఒక పక్క ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే బీఆర్ఎస్ నేతలు దశాబ్ది ఉత్సవాల పేరిట జల్సాలు చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి బాక్స్ డ్రెయిన్, వరద నీటి కాలువ పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరద ముంపు సమస్య పరిష్కరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇప్పటి వరకు బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తి చేయలేదన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా పనులు పూర్తికాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని, వీవీనగర్, శ్రీనగర్ కాలనీలో బాక్స్ డ్రెన్ పనుల వల్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రానున్న వర్షాకాలంలో కాలనీలలో ఏమైనా ప్రమాదం సంభవిస్తే పూర్తి బాధ్యత ఎమ్మెల్యేదే అన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాక్స్ డ్రెయిన్ పనులు చివరి దశలో ఉన్నట్లు ఎమ్మెల్యే సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని, వాస్తవానికి గడ్డిఅన్నారంలో 40 శాతం పనులు మాత్రమే అయ్యాయన్నారు. నాలాల్లోకి చెత్త రాకుండా చెరువు అవుట్‌లెట్ వద్ద జాలీ వేయడానికి టెండర్ పూర్తయినా కాంట్రాక్టర్ పనులు చేయకపోయిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, సీహెచ్ రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పుట్ట ఓంకార్, సందీప్, సాయితేజేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి లక్ష్మిప్రసాద్, ఉమర్, శివరాం పాల్గొన్నారు.

వైద్య రంగంలో తెలంగాణ అగ్రస్థానం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వైద్య రంగంలో దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానానికి ఎదిగిందని, హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌లోని ఇందిరా ఆడిటోరియంలో బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో నగరమంతా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న చికిత్సతో వైద్యులపై భారం పెరిగిందని, రోగుల సంఖ్య పెరుగుతుండటంతో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ నగరానికి నలువైపులా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దీంతో హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందుతుందని స్పష్టం చేశారు. కొత్తపేటలోని ఫ్రూట్ మార్కెట్ స్థలంలో రూ.1200 వందల కోట్లతో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వమే 26 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు.

- ఏ రాష్ట్రంలో లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈ కార్యక్రమంతో అనేక మంది వృద్ధులు ఉచితంగా కంటి పరీక్షలు చేసుకున్నారన్నారు. అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సుమారు లక్షన్నరకు పైగా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారని, 12,600 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు వివరించారు.
- పౌష్టికాహారంతోనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడనే ఉద్దేశంతో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు ర్ న్యూట్రిషన్ కిటట్లు, వైద్యశాఖలో ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ దశాబ్ది ఉత్సవాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, సరూర్‌నగర్ మండల వైద్యాధికారిణి డాక్టర్ అర్చన, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ పులేందర్‌నాయుడు, డాక్టర్ బాలస్వామి, డాక్టర్ హరిప్రియ నాయకులు జక్కిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు



అవయవదానం చేసిన చంద్రయ్య (ఫైల్)

మన్సూరాబాద్: ఓ రైతు తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడు. జీవన్‌ధాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన రైతు పందుల చంద్రయ్య (60) ఈ నెల 11న అకస్మాతుగా ఇంట్లో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు అత్యవసర చికిత్సను అందించారు. చంద్రయ్య చికిత్సకు స్పందించకపోవడంతో ఈ నెల 13న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌ధాన్ ప్రతినిధులు చంద్రయ్య కుటుంబసభ్యులకు అవయవదానంపై వివరించగా భార్య అండాలు, కుమారులు జగదీష్, భిక్షపతిలు అవయవదానంకు అంగీకరించారు. చంద్రయ్య రెండు కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్ సంస్థకు దానం చేశారు.

పిల్లలు చదువుకునేలా చొరవ తీసుకోవాలి



హయత్‌నగర్: పిల్లలు చదువుకునేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ చొరవ తీసుకోవాలని హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఆమె అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. చదువు ప్రతి ఒక్కరికి అవసరమని, అదే బతుకు దారి చూపుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఆస్తులను సంపాదించకున్నా చదువును చెప్పించాలని అదే వారికి మనం ఇచ్చే ఆస్తి అన్నారు. పాఠశాలకు వెళ్లని వారిని గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు.

మెరుగైన సేవల కోసమే వార్డు కార్యాలయాలు



కార్పొరేటర్లు, అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమీషనర్ పంకజా

ఎల్‌బీనగర్: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజా తెలిపారు. బుధవారం జోనల్ పరిధిలోని 5 సర్కిళ్లలో కార్పొరేటర్లు, వార్డు అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 16న నూతనంగా అన్ని డివిజన్‌లలో వార్డు కార్యాలయాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యాలయాలలో అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. మ్యాన్‌హోల్స్ మూతలు, నీటి నిలువ ప్రాంతాలు, మురుగు నీటి సమస్య ఫుట్‌పాత్ ఆక్రమణలు, వీధి దీపాలు, దోమల సమస్యలను ఇతర చిన్న సమస్యలను ఒక్క రోజులోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో డీసీలు మారుతి దివాకర్, కృష్ణయ్య, సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

హస్తినాపురం: దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై ఎమ్మెల్యే అనుచరులు చేసిన దాడిని లో గాయపడిన అతనిని సీతక్క పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలకు పోలీసులు చట్టం చుట్టంలా వ్యవహరిస్తోందన్నారు. రాజశేఖర్ రెడ్డి, ప్రవీన్‌రెడ్డిపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేసి వారిపై దాడిచేసిన బీఆర్ఎస్ నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శశిధర్‌రెడ్డి, నర్సింహయాదవ్, ప్రవీన్‌రెడ్డి, గౌస్, యశ్వంత్‌రాజ్, శ్రీనాథ్‌రావు, రంజిత్ పాలొన్నారు.

బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

నాగోలు: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ పోలీస్ అరెస్టు చేశారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం, యంజాల్‌కు చెందిన బాలం రాజేష్(20) శంషాబాద్‌లో డెలివరీ డాట్‌కామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన సయ్యద్ మజర్(19) నగరానికి వచ్చి విరాట్ నగర్‌లో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నాడు. రాజేష్, మజర్ ఇద్దరికి బేగంపేటలోని క్యాటరింగ్ వర్క్‌లో పరిచయం ఏర్పడింది. ఇటీవల రాజేష్ ఫైనాన్స్‌లో ఓ ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి సమయానికి ఫైనాన్స్ చెల్లించకపోవడంతో అతని ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. మజర్ కూడా సరిగ్గా పనికి వెళ్లకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు సతమతమవుతున్నాడు. దీంతో ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనాలు చోరీలు చేయాలని నిర్ణయించి పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసి తక్కువ ధరలకు విక్రయించి జల్సాలు చేసేవారు. ఎల్‌బీనగర్, చైతన్యపురి, ఉప్పల్, మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 8 ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 3 లక్షల విలువైన 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి, డీఐ ఉపేందర్‌రావు, డీఎస్ఐ నరేందర్ పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ



నోట్ పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

విద్యార్థులు చదువులో రాణించాలి

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సూచించారు. బుధవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీలో ప్రైమరీ పాఠశాలల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ విద్యార్థుల చేతులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైపురికాలనీ వాసులు రవికుమార్, ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

చంచల్‌గూడ జైలులో దశాబ్ది ఉత్సవాలు



ఖైదీల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేసిన హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి డాక్టర్ జితేందర్

చంచలగూడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని జైళ్లలోని శిక్షా ఖైదీలను పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నామని హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ జితేందర్ అన్నారు. బుధవారం చంచలగూడ జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఖైదీల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేసారు. అలాగే ఫైన్ కట్టలేక విడుదల కాలేని వారికి ఫైన్ ఎమౌంట్ చెల్లించి ఈరోజే విడుదల చేసారు. వివిధ జైళ్లలో ఖైదీలకు రూ. 25 వేల నుండి 50 వేల వరకు వడ్డీ రహిత రుణాలు అందజేశామని అధికారులు తెలిపారు. మహిళా ఖైదీల పిల్లలకు న్యూట్రిషన్ కిట్లను అందజేసారు. ఈ కార్యక్రమం ద్వారా 50 మంది శిక్షా ఖైదీల కుటుంబాలు లబ్ది పొందారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజి వై.రాజేష్, డీఐజీ మురళీబాబు, వరంగల్ రేంజ్ డీఐజీ డి.శ్రీనివాస్, ఖైదీల కుటుంబాలు, వారి పిల్లలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల అన్నారు. బుధవారం కుర్మగూడ డివిజన్ ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆరోగ్య మహిళా కిట్ల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లను గర్భిణులు వినియోగించుకోవాలి

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వము మహిళలు మాతృత్వపు ఆనందాన్ని ఆస్వాదించాలనే సంకల్పముతో ప్రవేశపెట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను గర్భిణులు ఉపయోగించుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల అన్నారు. బుధవారం మలక్‌పేటలో గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలక్‌పేట క్లస్టర్ పరిధిలో 1500 మంది గర్భిణీలు పేర్లు నమోదు చేసుకున్నారని అన్నారు. మొదటిరోజు 100 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజున్నీసా పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న నారగోని శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం హస్తినాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి శ్రీనివాస్ యాదవ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు దాతలు చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మంత్రి సబితాఇంద్రారెడ్డి సహకారంతో ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి పరిచి ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డేవిడ్, ఉపాధ్యాయులు నాగమణి, విజయ్‌కుమార్, మాధవిదేవి, వేణుగోపాల్, సంఘమిత్ర, సునిత, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.